# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ శనివారం 22 జూన్ 2024 | ADILABAD NIRMAL


## ఉద్యమ స్ఫూర్తి ప్రదాత జయశంకర్ సార్

- మాజీ మంత్రి జోగు రామన్న
- ప్రొఫెసర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు

ఎదులాపురం, జూన్ 21: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ..తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించాలన్న సంకల్పంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. అప్పటి ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలబడి ధైర్యం ఇచ్చేవారని తెలిపారు. ఆ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏ అజయ్, బీసీ పట్టణ అధ్యక్షుడు దాసరి రమేశ్, సీనియర్ నాయకులు సేవ్వ జగదీశ్, విజ్జగిరి నారాయణ, కౌన్సిలర్లు వెనుగంటి ప్రకాశ్, బండారి సతీశ్, రాంకుమార్, తదితరులు ఉన్నారు.జయశంకర్ సార్ సేవలు మరువలేనివని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జయశంకర్ విగ్రహానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుంకిడి ఎంపీటీసీ వెంకట్ యాదవ్, నలిమెలి నవీన్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగరాజ్ ఉన్నారు.



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రామన్న, నాయకులు



## మిల్లులకు ఫుల్ కరెంట్

**కేసీఆర్ సర్కార్‌లో నిరంతరాయంగా సరఫరా**

- స్వరాష్ట్రంలో పెరిగిన మిల్లుల సంఖ్య
- 2014కి ముందు 8 నుంచి 10 గంటలే కరెంట్
- వెలుగులు నింపిన కేసీఆర్‌పై నిందలు సరికాదంటున్న యజమానులు

మంచిర్యాల, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పదేళ్ల కేసీఆర్ పాలనలో పారిశ్రామికీకరణ పరుగందుకున్నది. అందుకు ప్రభుత్వం తెచ్చిన నూతన విధానాలే కాదు, నాణ్యమైన కరెంట్ కూడా ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. నాటి ఉమ్మడి రాష్ట్రంలో పవర్‌హాలీడేలు, మరెన్నో ఆంక్షల మధ్యన మిల్లులు మూత పడే పరిస్థితి దాపురించగా, స్వరాష్ట్రం వచ్చిన తర్వాత వాటి సంఖ్య రెట్టింపు అయ్యింది.

### తెలంగాణ రాకముందు నరకయాతన

తెలంగాణ రాక ముందు కరెంట్ కోసం మిల్లుల యజమానులు నరకయాతన పడ్డారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని గందరగోళ పరిస్థితి ఉండేది. వారానికో తీరు షెడ్యూలు అమలు చేసేవాళ్లు. ఆ షెడ్యూల్ ప్రకారంగానైనా కరెంట్ ఇచ్చేవాళ్లు కాదు. ఈ కారణంగా పరిశ్రమల నిర్వాహకులు తీవ్ర నష్టాలను చవిచూసేవాళ్లు. రాత్రి సమయంలో 8 గంటలు నుంచి 10 గంటలే కరెంట్ ఇచ్చేటోళ్లు. సాయత్రం పని మొదలైతే తెల్లారేజాము దాకా చేసేటోళ్లు. హమాలీలు రాత్రంతా పని చేసి పొద్దంతా పడుకునేటోళ్లు. ఒళ్లంతా పుండు చేసుకొని ఆరోగ్యం పాడు చేసుకునేటోళ్లు. కేసీఆర్ సీఎం అయ్యాక ఆ పరిస్థితి పోయింది. మిల్లులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇచ్చారు. ఎప్పుడంటే అప్పుడు ధాన్యం పట్టించుకునే రోజులు వచ్చినయ్. గతంతో పోలిస్తే కేసీఆర్ హయాంలోనే మాకు మంచిరోజులు వచ్చినయని యజమానులు చెబుతున్నారు. 24 గంటల కరెంట్‌తో గడిచిన పదేళ్లలో మిల్లుల సంఖ్య పెరిగిందని, అలాంటి కేసీఆర్‌ను కరెంట్ ఏడ కొన్నరు.. ఎందుకు కొన్నరు.. అని ప్రశ్నించడం సరికాదని మండిపడుతున్నారు. కాంగెసోళ్లు ఇచ్చేది ఉండదు.. సచ్చేది ఉండదు కానీ అక్కరకు రాని పనులు చేస్తారని చెబుతున్నారు. కేసీఆర్ 24 గంటల కరెంట్ మీద తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

### కోతలు లేని కరెంట్‌కు శ్రీకారం చుట్టింది కేసీఆరే

*చెన్నూర్ రూరల్, జూన్ 21 : నేను చాలా ఏళ్లుగా రైస్ మిల్లు నిర్వహిస్తున్న. 2014 కంటే ముందు ఇష్టం వచ్చినట్లు కరెంట్ కోతలు పెట్టేటోళ్లు. గ్రామీణ ప్రాంతాల్లో పగలు ఒక్క వారం 8 గంటలు కోత, మరొక వారం 6 గంటల కోతలు విధించేటోళ్లు. తెలంగాణ రాష్ట్రం వచ్చి.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యుత్ సరఫరాలో చాలా మార్పు వచ్చింది. అటు రైతులు, ఇటు గృహ అవసరాలకేగాక పరిశ్రమలకూ నిరంతరంగా మెరుగైన విద్యుత్ అందించారు. కోతలు లేని కరెంటుకు శ్రీకారం చుట్టింది కేసీఆర్ ఘనతే.*

**-కాళేశ్వరం సాగర్ గౌడ్, రైస్ మిల్లు యాజమాని, చెన్నూర్**



### కరెంటు కోతలతో నష్టాల పాలవుతున్నాం



*భైంసాటౌన్, జూన్, 21 : నేను చాలా కాలం నుంచి రైస్‌మిల్ నడుపుతున్నా. 2014కు ముందు కరెంటు కష్టాలు అనుభవించాం. 2014 తర్వాత కేసీఆర్ పాలనలో నిరంతర నాణ్యమైన కరెంటు అందివ్వడంతో సుఖంగా జీవించాం. ఇప్పుడు వేళాపాలా లేకుండా కరెంటు కోతలు విధిస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కరెంటు కోతలతో చాలా సార్లు మిల్లింగ్ ఆపేయాల్సి వస్తున్నది. మిల్లింగ్ జరిగినా, జరగకపోయినా వారు మాట్లాడుకున్నంత కూలీలకు కూలి ఇవ్వాల్సిందే. దీంతో ఖర్చులు పెరగడంతో పాటు లాభాలు లేక నష్టపోతున్నాం. గతంలో నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను అందించేవారు.*

**-రూపేశ్, శ్రీ రాజరాజేశ్వర రైస్‌మిల్, వానల్‌పాడ్**

### పదేండ్లు కరెంటు కోతలు లేవు



*భైంసాటౌన్, జూన్, 21 : తెలంగాణ రాష్ట్రం రాకముందు కరెంటు ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. ఇప్పుడు ఎప్పుడు పడితే అప్పుడు కరెంటు కోతలు విధిస్తున్నారు. ఒక్కోసారి లోవోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. పరిశ్రమల రంగానికి కోతలు లేకుండా కరెంటు ఇచ్చారు. ఎన్నికల సమయంలో 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఇష్టానుసారం కోతలు విధిస్తున్నది. దీంతో పరిశ్రమలు నడపడం కష్టంగా మారింది. ఇప్పటికైనా గత ప్రభుత్వం మాదిరిగా నాణ్యతతో కూడిన నిరంతర విద్యుత్‌ను అందిస్తారని ఆశిస్తున్నాం.*

**-మహేశ్, సిద్ధేశ్వర రైస్‌మిల్, సుంక్లి**



## పత్తి సాగు పనులు షురూ..

మాన్కాపూర్ పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

**అన్నదాతలు విత్తనాలు వేసే పనులు మొదలు పెట్టారు. నార్నూర్, గాదిగూడ మండలంలో రెండు మూడు రోజుల నుంచి వర్షాలు కురవడంతో పొలాలు తడిసి ముద్దయ్యాయి. దీంతో వానకాలం సాగు ఊపందుకున్నది. భూమి తడి ఆరకముందే రైతులు పత్తి విత్తనాలు వేస్తున్నారు. మండలంలో శుక్రవారం అచ్చు కొట్టడం, విత్తనాలు వేయడం పనుల్లో రైతులు, కూలీలు బిజీగా కనిపించారు. - నార్నూర్, జూన్ 21**

## ప్రతి రోజూ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ చైన్‌గేట్, జూన్, 21: ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేలా ప్రతి రోజూ ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణితో పాటు మిగతా పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు అందించి రసీదులు పొందవచ్చని, ఫిర్యాదుల పురోగతిని సంబంధిత శాఖల వారీగా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

## అధికారుల పనితీరు మారాలి

- విద్యాశాఖలో అంతా అస్తవ్యస్తం
- బదిలీల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు
- ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వీడాలి
- సాగులో ఉన్న అటవీ భూములను లాక్కోవద్దు
- జడ్పీ సమావేశంలో సభ్యుల డిమాండ్



ఆదిలాబాద్ జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ఆదిలాబాద్, జూన్ 21 ( నమస్తే తెలంగాణ) : ఆయా శాఖల అధికారుల పనితీరు మార్చుకోవాలని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జడ్పీ సమావేశం హాల్‌లో చైర్మన్ రాథోడ్ జనార్దన్ అధ్యక్షతన జరిగిన చివరి సమావేశానికి ఎంపీ నగేశ్, ఆసిఫాబాద్, బోథ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, పాయల్ శంకర్, కలెక్టర్ రాజర్షి షా హాజరయ్యారు. ఈ సమావేశంలో విద్యా, వ్యవసాయం, అటవీ శాఖలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. జిల్లాలో విద్యా శాఖ పనితీరు అస్తవ్యస్తంగా మారిందని, ఉపాధ్యాయుల బదిలీల్లో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆదిలాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లోని స్కూళ్లలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌లు ఇస్తే గిరిజన, మారుమూల పాఠశాలల పరిస్థితి ఏమిటని, బోథ్ విద్యాశాఖ అధికారులు పనితీరు మార్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సూచించారు. గుడిహత్నూర్ పాఠశాలలో 14 మంది ఉపాధ్యాయులకు గాను ఐదుగురినే కేటాయించారని, ఈ విషయంపై డీఈవోకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని జడ్పీటీసీ బ్రహ్మానంద్ అన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు, మన బడి పథకంలో పనులను అర్థాంతరంగా నిలిపివేశారని, వాటిని ఎప్పుడు పూర్తి చేస్తారని, అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట కొత్తగా పనులు చేపడుతున్నారని తాంసి జడ్పీటీసీ రాజు ప్రశ్నించారు. బోథ్ ఎక్స్‌రోడ్ నుంచి బోథ్ మండల కేంద్రం వరకు రహదారి మరమ్మతుల కోసం నిధులు మంజూరైన పనులు చేయడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అటవీ శాఖ అనుమతుల పేరిట జాప్యం చేస్తున్నారని బోథ్ జడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు. వర్షాల దృష్ట్యా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సభ్యులు కోరారు. గాదిగూడ మండలంలో నిధులు మంజూరైనా వంతెనలు ఎందుకు నిర్మించడం లేదని జడ్పీటీసీ మెస్రం గంగుబాయి ప్రశ్నించారు. ఎన్నో ఏళ్లుగా గిరిజనులు సాగుచేస్తున్న అటవీ భూముల్లో అధికారులు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారని, ఈ ప్రయత్నాలు ఆపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ నగేశ్, కలెక్టర్ రాజర్షి షాను సభ్యులు సన్మానించారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

### అందరి సహకారంతో అభివృద్ధి



ఐదు సంవత్సరాలు జిల్లా పరిషత్ పాలకవర్గం అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేసినట్లు జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సభ్యులు సహరించారన్నారు. ఐదేళ్ల పాలన ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. పదవీకాలం ముగిసినా సభ్యులు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వివిధ శాఖల అధికారుల సైతం ప్రజలకు మరింత సేవ చేసి వారి మన్ననలు పొందాలని సూచించారు.

**- జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్**

### సాగు భూములను లాక్కోవద్దు



బోథ్ నియోజకవర్గంలో కేశవపట్నం, గుండాల, సిరిచెల్మ, ఇతర గ్రామాల్లో 30 ఏళ్లుగా గిరిజనేతరులు సాగు చేస్తున్న భూముల్లో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటి స్వాధీనం చేసుకునేందుకు చూస్తున్నారు. దీంతో రైతులు ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది. బోథ్ ఎక్స్‌రోడ్‌లో అటవీ శాఖ ఏర్పాటు చేసిన పనులకు సంబంధించిన నిధులు, పనుల వివరాలు తెలుపడం లేదు. నాణ్యత పాటించడం లేదు. పాఠశాలల్లో ఉపాధ్యాయులను పూర్తిస్థాయిలో నియమించాలి. తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్లు ఇతర పనులు పూర్తి చేయాలి.

**- అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే**

### ఐదేళ్లుగా రోడ్డు పనులు ఎందుకు పూర్తి కాలేదు



ఐదేళ్లుగా ఆదిలాబాద్ నుంచి కెరామెరి వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆర్అండ్ బీ అధికారులు ఎందుకు పూర్తి చేయడం లేదు. ఈ రోడ్డు నిర్మాణంతో పలు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. రహదారుల నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టిస్తున్నా పనులు ప్రారంభంకావడం లేదు. గాదిగూడ మండలంలో ప్రధాన రహదారులపై లోతట్టు ప్రాంతాల్లో వంతెన నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిధులు మంజూరైనా పనులను పూర్తి చేయడం లేదు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.

**- కోవలక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్**

### అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు



గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దు. పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, ఐటీడీఏ అధికారులు అటవీశాఖ అనుమతుల పేరిట పనుల్లో జాప్యం చేయొద్దు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటా.

**- జీ నగేశ్, ఆదిలాబాద్ ఎంపీ**

### సమస్యలను అసెంబ్లీలో చర్చిస్తాం



జిల్లా అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలందరం కలిసి అసెంబ్లీలో చర్చించి పరిష్కారమయ్యేలా చూస్తాం. అధికారులు అభివృద్ధికి సంబంధించిన అంశాలను తమకు తెలియజేయాలి. రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ దవాఖానలో వైద్యుల నియామకం, పంచాయతీ రాజ్ పనులు ఆర్ అండ్ బీ శాఖకు బదాలాయించడం, చనాక-కొరాట ప్రాజెక్టు భూ సేకరణ కోసం సమావేశంలో తీర్మానాలు చేయాలని సభ్యులను కోరుతున్నాం.

**- పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్**


ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతుండగా వీడియో చిత్రీకరిస్తున్న ఎమ్మెల్యే పీఏ





### ఫోన్‌లో గుసగుసలు..

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కొనసాగుతుండగా అధికారులు, ప్రజాప్రతినిధులు సెల్‌ఫోన్లలో గుస గుసలు మొదలుపెట్టారు. సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతుండగా అక్కడే ఉన్న ఎమ్మెల్యే పర్సనల్ అసిస్టెంట్ తన ఫోన్‌లో చిత్రీకరించాడు. అనంతరం ఆ వీడియోను ఎమ్మెల్యేకు చూపించాడు.

**-ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటో గ్రాఫర్**




సమావేశం మధ్యలో ఫోన్‌లో మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- నిత్య జీవితంలో భాగమవ్వాలి
- ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్
- ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం



యోగా దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్


యోగ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్


యోగాసనాలు వేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ఎదులాపురం, జూన్ 21 : రోజురోజుకీ పెరుగుతున్న మానసిక, శారీరక ఒత్తిళ్ల కారణంగా మనిషి జీవన విధానం కష్టతరంగా మారుతున్నదని, యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. యోగా గురువు తిరుపతిరెడ్డి పలు ఆసనాలు వేయించగా అధికారులు, ప్రజాప్రతినిధులు యోగా సాధన చేశారు. అనంతరం యోగా గురువులను సత్కరించారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ భారతదేశంతోపాటు ప్రపంచ దేశాల్లోనూ ప్రస్తుతం యోగా సాధన చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ ప్రవీణ్ కుమార్, వైద్య విద్యార్థులు ఉన్నారు. జిల్లా కోర్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన యోగాడే కార్యక్రమంలో జిల్లా జడ్జి కే ప్రభాకర్‌రావు, న్యాయమూర్తులు పీ శివరాంప్రసాద్, డాక్టర్ ప్రమీలాజైన్, దుర్గారాణి పాల్గొని యోగా శిక్షకుల సూచనల మేరకు యోగాసనాలు చేశారు.

### పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో..

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో యో గా డే ను నిర్వహించారు. జిల్లా ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి అధికారు లు, సిబ్బంది యోగాసనాలు చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లో యోగా డేను నిర్వహించినట్లు తెలిపారు. డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, ఆర్ఐ సీఐ ఎన్. చంద్రశేఖర్, పట్టణ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్, 21 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ అభ్యసించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్‌లోని దివ్య గార్డెన్‌లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్, వశిష్ట యోగా సంఘటన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి జె గంగాదాస్, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, డీఈవో రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, డీడబ్ల్యూవో నాగమణి, పీఆర్ ఈఈ శంకరయ్య, వైద్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

### నిర్మల్ జిల్లా సాయుధ దళ కార్యాలయంలో..

నిర్మల్ అర్బన్, జూన్ 21 : జిల్లా సాయుధ దళ కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఆర్ సిబ్బందితో ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల యోగాసనాలు వేశారు. అన్ని పోలీస్ స్టేషన్‌లలో యోగా దినోత్సవాన్ని నిర్వహించామని తెలిపారు.